సాక్షి
విశాఖపట్నం

బుధవారం । 4 । అక్టోబర్ । 2023



దేశాభివృద్ధిలో యువతే కీలకం

దేశ అభివృద్ధిలో యువతే కీలకమని నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ రాష్ట్ర సంచాలకులు విజయరావు అన్నారు. 8లో



చెస్‌లో హాన్య, ఆన్ష్ ఆధిక్యం

చదరంగం చాంపియన్‌షిప్ బాలికల్లో హాన్య షా, ఓపెన్‌లో ఆన్ష్ నందన్ ఆధిక్యం కొనసాగిస్తున్నారు. 8లో



దొంగల ఆట కట్టించారు

నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన చోరీ కేసులను పోలీసులు ఛేదించారు. 12లో

న్యూస్‌రీల్

15న హాఫ్ మారథాన్



పోస్టర్ విడుదల చేస్తున్న ఏఎంసీ నిర్వాహక కమిటీ

విశాఖ స్పోర్ట్స్: ఆర్.కె.బీచ్‌లోని కాళీమాత ఆలయం నుంచి రన్ ఫర్ హెల్త్ పేరిట ఈ నెల 15న హాఫ్ మారథాన్ జరగనుంది. ఆంధ్రా మెడికల్ కళాశాల శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈ పరుగు నిర్వహిస్తున్నట్లు ఏఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిబాబు తెలిపారు. ఏఎంసీలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఈ వివరాలను ఆయన వెల్లడించారు. హాఫ్ మారథాన్‌తో పాటు 3కే, 5కే, 10కే పరుగును కాళీమాత ఆలయం నుంచి ప్రారంభిస్తామన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి టీషర్ట్‌తో పాటు విజేతలకు లక్ష రూపాయల బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు. https://amc100yearsrun.iq301.com/ లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. క్రీడల వైస్ ప్రెసిడెంట్ ఆర్.సునీల్‌కుమార్, నిర్వాహక కమిటీ ప్రతినిధులు కృష్ణవేణి, శ్వేతా రావులతో కలిసి పోస్టర్, టీషర్ట్‌ను విడుదల చేశారు.

పకడ్బందీగా ఓటర్ల జాబితా సవరణ



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జేసీ విశ్వనాథన్, డీఆర్వో మోహన్‌కుమార్, ఆర్డీవోలు

మహారాణిపేట: ఓటరు జాబితా సవరణ-2024ను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా రూపొందించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. రాజకీయ పార్టీలు సమర్పించిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, చనిపోయిన, డూప్లికేట్, బదిలీ, నకిలీ ఓటర్ల జాబితా పరిశీలన, ఎపిక్ కార్డు జనరేషన్, తదితర అంశాలపై మంగళవారం విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించారు. జిల్లాలో ఎన్నికల జాబితా సవరణ-2024 ప్రగతిపై జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయనకు వివరించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి డీఆర్వో కె.మోహన్‌కుమార్, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి, ఎన్నికల విభాగం అధికారులు, ఎస్డీసీలు పాల్గొన్నారు.

చిరు ధాన్యాల ఉత్పత్తి యూనిట్‌కు నేడు సీఎం జగన్ శంకుస్థాపన

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో చిరు, తృణ ధాన్యాల ఉత్పత్తి యూనిట్ నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. ఈ యూనిట్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం, స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ రూ.4.46 కోట్లు మంజూరు చేసింది. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు పద్మనాభం మండల పరిషత్ కార్యాలయంలో తగిన ఏర్పాట్లు చేశారు. మాజీమంత్రి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కలెక్టర్ ఎ.మల్లికార్జున తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని రాష్ట్ర ఆహార శుద్ధి సొసైటీ జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.ఎ.రహీమ్ తెలిపారు.

నేటి నుంచి మానసిక ఆరోగ్య వారోత్సవాలు

మహారాణిపేట: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 4 నుంచి పదో తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి తెలిపారు. ప్రభుత్వ మానసిక వైద్యశాలలో బుధవారం ఈ వారోత్సవాలను ప్రారంభిస్తున్నామని, అతిథులుగా ఏయూ వీసీ పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు హాజరవుతారని తెలియజేశారు. 'మానసిక ఆరోగ్యం.. సార్వత్రిక మానవ హక్కు' నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తామని, ఈ నెల 10వ తేదీన బీచ్‌లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తామని వివరించారు.

6న మినీ జాబ్ మేళా

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలోని ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా కార్యాలయంలో ఈ నెల 6న మినీ జాబ్ మేళా నిర్వహించనున్నామని ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి సాయికృష్ణ చైతన్య తెలిపారు. యకోహామా టైర్స్ కంపెనీలో 100 పోస్టుల భర్తీ కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 2019- 24 విద్యా సంవత్సరాల్లో ఐటీఐ, డిగ్రీ, డిప్లమోలో ఉత్తీర్ణత పొందినవారు ఈ ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని, ఎంపికైన అభ్యర్థులు అచ్యుతాపురంలో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు 9292553352 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకుంటున్న వైద్యులు



బీపీ చూస్తూ..



రక్తాన్ని సేకరిస్తూ..



కంటిని పరీక్షిస్తూ..



దంత పరీక్షలు చేస్తూ..



మందులు అందజేస్తూ..

ప్రజారోగ్యానికి రక్ష

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని



ఇసుకతోట యూపీహెచ్‌సీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్డులు అందజేస్తున్న మంత్రి విడదల రజని, ఎంపీ ఎంవీవీ, మేయర్ హరి వెంకట కుమారి, కలెక్టర్ మల్లికార్జున, కమిషనర్ సాయికాంత్ వర్మ

మద్దిలపాలెం: ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని అన్నారు. జీవీఎంసీ 16వ వార్డులోని ఇసుకతోట అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ గొలగాని హరివెంకటకుమారితో కలిసి ఆమె ప్రారంభించారు. శిబిరంలో ఏర్పాటు చేసిన స్టాళ్లు, వైద్య పరీక్షల చేస్తున్న విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. శిబిరానికి హాజరైన రోగులతో ఆప్యాయంగా మాట్లాడి.. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు సూచించారు. వైద్య శిబిరానికి వచ్చిన చిన్నారులతో ముచ్చటించారు. వృద్ధులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 122 వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ శిబిరాల్లో మెరుగైన వైద్యం కోసం గుర్తించిన రోగులకు రిఫరల్ ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ ద్వారా సేవలందిస్తామన్నారు. ఎంపీ, తూర్పు సమన్వయకర్త ఎంవీవీ మాట్లాడుతూ స్పెషలిస్ట్ వైద్యులతో నిర్వహిస్తున్న ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మేయర్ హరివెంకటకుమారి మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలో 72 వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో అన్ని రకాల వైద్య పరీక్షలు, మందులు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో 1,550 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మెరుగైన వైద్య పరీక్షలకు 21 మందిని ఎంపిక చేసి ఆరోగ్య శ్రీ రిఫరల్ ఆస్పత్రులకు సిఫారసు చేశారు. జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రామిరెడ్డి, జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసిరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు, కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్ విశ్వమిత్ర, జిల్లా మలేరియా అధికారి ఎం.తులసి, 16వ వార్డు కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, 16, 23, 28వ వార్డుల ఇన్‌చార్జిలు అప్పారి గిరిబాబు, గుడ్ల సత్యారెడ్డి, పల్లా దుర్గారావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏడు శిబిరాల్లో 3,027 మందికి సేవలు

మహారాణిపేట: జిల్లాలో మంగళవారం ఏడు ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో మొత్తం 3,027 మందికి వైద్య సేవలందించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వర రావు తెలిపారు. ఇసుకతోట యూపీహెచ్‌సీ, పెదగంట్యాడ పరిధి కాపు తుంగ్లాం, మధురవాడ పరిధి వాంబే కాలనీ, పెందుర్తి పరిధి గుర్రంపాలెం, ఆనందపురం పరిధి లోడగలవానిపాలెం, రేవడి పద్మనాభం పరిధి గంధవరం, భీమిలి పరిధి టి.నగరపాలెంలో ఈ శిబిరాలు జరిగాయి.

నేడు 7 చోట్ల వైద్య శిబిరాలు

మహారాణిపేట: జిల్లాలోని ఏడు ప్రాంతాల్లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. అర్బన్ పరిధి బాపూజీనగర్(కంచరపాలెం) యూపీహెచ్‌సీ, కొత్త గాజువాక యూపీహెచ్‌సీ, చినముషిడివాడ(పెందుర్తి) యూపీహెచ్‌సీ, చింతగట్ల(పెందుర్తి) వైఎస్సార్ హెల్త్ క్లినిక్, గొట్టిపల్లి(ఆనందపురం) వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రేవిడి(పద్మనాభం) వైఎస్సార్ హెల్త్ క్లినిక్, మజ్జిపేట(భీమిలి)లో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో కోరారు.

అయ్యన్న నోటి దురుసు

దాని పేరేమి పేరు.. అని బ్రాహ్మణి గురించి ప్రస్తావన..

లోకేష్ భార్య బాలకృష్ణ చిన్న కూతురా..

పెద్ద కూతురా.. అని వ్యాఖ్య

పేరు గుర్తుకురాక మీడియా ముందు నానా తంటాలు..

అవాక్కయి బిత్తర చూపులు చూసిన టీడీపీ నేతలు..

ఇదీ మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు మీడియాతో అసభ్యంగా, అడ్డదిడ్డంగా మాట్లాడిన మాటల పర్యవసానం. టీడీపీలో మహిళలకు గౌరవం లేదన్న విషయం చర్చనీయాంశం అయిన దశలో.. అయ్యన్న అవాకులు చవాకులు నష్టం చేకూరుస్తాయని సొంత పార్టీ వారే నొసలు చిట్లిస్తున్న వైనం..



సాక్షి, అనకాపల్లి: ఎప్పుడూ ఏదో ఒక వివాదంలో కనిపించే మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు నోటి దురుసుతనం మరోసారి సంచలనమైంది. ఈసారి స్వయానా టీడీపీ అధినేత చంద్రబాబు కోడలు, చినబాబు లోకేష్ భార్య, బాలకృష్ణ పెద్ద కూతురు బ్రాహ్మణినే అవమానిస్తూ..హేళన చేస్తూ మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజున చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా నర్సీపట్నం టౌన్‌లో

ఏర్పాటు చేసిన టీడీపీ మహిళా దీక్షా కార్యక్రమంలో అయ్యన్న మీడియాతో మాట్లాడుతూ.. 'బాలకృష్ణ చిన్న కూతురా.. లేదా పెద్ద కూతురా.. దాని పేరేమిపేరు..' అంటూ తన సహజసిద్ధమైన రీతిలో అసహ్యకరంగా మాట్లాడారు. ప్రస్తుతం టీడీపీలో కీలకపాత్ర పోషిస్తున్న నారా బ్రాహ్మణి పేరు గుర్తుకురాక మీడియా ముందు అయ్యన్న నానా తంటాలు పడ్డారు. ఒక సీనియర్ మాజీ మంత్రి అలా అవహేళన చేసి మాట్లాడడంతో అక్కడున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు బిత్తర చూపులు చూస్తూ ఉండిపోయారు. ఇప్పుడు ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ తమ్ముళ్లు అయ్యన్నపై గుర్రుగా ఉన్నారు. చంద్రబాబుని జైలు పాలు చేసిన స్కిల్ స్కాంకు తనకు ఎటువంటి సంబంధం లేదని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు చెప్పకనే చెప్పారు. ఇప్పుడు మరో సీనియర్ నేత అయ్యన్న అధినేత కోడలినే హేళన చేసి మాట్లాడారు. ఇవన్నీ చూస్తుంటే టీడీపీ మాజీ మంత్రులు, సీనియర్ నేతలకు పార్టీ అధిష్టానంపై ఎంత గౌరవం ఉందో అర్థం అవుతోంది. ఇక సొంత పార్టీలోనే కొందరు టీడీపీ మహిళా నేతలు.. అయ్యన్నపాత్రుడికి ఆడవారిని గౌరవించడం రాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయ్యన్నపాత్రుడు నోటి దురుసుకు చెక్ పెట్టకపోతే పార్టీ నష్టపోయే ప్రమాదముందని సీనియర్ నేతలు మథనపడుతున్నట్టు సమాచారం. ఇప్పటికే ఇద్దరు సీనియర్ మాజీ మంత్రులు మాట తూలారు. క్రమశిక్షణ తప్పారు. భవిష్యత్తులో మరింతమంది తలో రకంగా వ్యవహరిస్తే పార్టీ మరింత కష్టాల్లో పడుతుందన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

ఇకపై డిజిటల్ కార్డులే!

- ఆరు నెలలుగా నిలిచిన డీఎల్, ఆర్‌సీ కార్డుల జారీ
- ఇలాంటివి జిల్లాలో సుమారు 15 వేలు
- వీటి పంపిణీకి రవాణా శాఖ సన్నాహాలు
- రెండు మూడు రోజుల్లో ముద్రణ మొదలు
- డిజిటల్ కార్డుల రాకతో ఫీజు వసూలుకు స్వస్తి



డిజిటల్ డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్

సాక్షి, విశాఖపట్నం: రవాణా శాఖ ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటోంది. దీంతో డ్రైవింగ్ లైసెన్సు (డీఎల్), వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్‌సీ) కార్డుల జారీ సులభతరం కానుంది. ఇకపై పాత (ప్లాస్టిక్) కార్డుల జారీ నిలిచిపోనుంది. వాటి స్థానంలో డిజిటల్ రూపంలోనే అందుబాటులోకి రానున్నాయి. దాదాపు ఆరు నెలలుగా రవాణా శాఖ ఈ కార్డులను జారీ చేయడం లేదు. విశాఖ డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ (డీటీసీ) పరిధిలో రోజుకు సగటున 150 వరకు ఆర్సీలు, డ్రైవింగ్ లైసెన్సులు జారీ అవుతుంటాయి. ఇలా గత ఆరు నెలల్లో 15 వేల వరకు ఈ కార్డులను పంపిణీ చేయాల్సి ఉందని అంచనా వేస్తున్నారు. కార్డుల ముద్రణకు వీలుగా రవాణా శాఖ ప్రింటర్లను సిద్ధం చేస్తున్నారు. రెండు మూడు రోజుల్లో వీటి ముద్రణ ప్రక్రియను పాత విధానంలో చేపట్టనున్నారు. అనంతరం దశలవారీగా ఈ కార్డులను ఇప్పటికే ఫీజు సొమ్ము చెల్లించిన సంబంధిత వ్యక్తుల చిరునామాలకు పోస్టల్ ద్వారా పంపించనున్నారు. అప్పటి వరకు ట్రాఫిక్ పోలీసులు గాని, రవాణా శాఖ అధికారులు గాని తనిఖీ చేసేటప్పుడు డిజిటల్ ఫార్మాట్‌లో ఉన్న కార్డులను చూపిస్తే సరిపోతుందని రవాణా శాఖ ఉప కమిషనర్ జీసీ రాజారత్నం తెలిపారు. మొబైల్ ఫోన్ లేని వారు కార్డులను ప్రింట్ చేయించుకుని తమతో పాటు ఉంచుకోవాలని ఆయన కోరారు.

నిలిచిన ఫీజులు వసూలు

ఇప్పటివరకు డ్రైవింగ్ లైసెన్స్/ఆర్సీ కార్డు జారీకి ఫీజు కింద రూ.200, పోస్టల్ చార్జీ కింద రూ.25 చొప్పున రవాణా శాఖ వసూలు చేస్తోంది. ఈ మొత్తం చెల్లించిన వారికి సంబంధిత కార్డులను పోస్టల్ ద్వారా పంపిస్తోంది. అయితే జులై 29 నుంచి ఈ ఫీజుల వసూలును నిలిపి వేసింది. మరోవైపు విశాఖ జిల్లాలో గతంలో ముద్రించిన కార్డులను పోస్టల్ ద్వారా పంపిస్తే ఆ చిరునామాల్లో సంబధిత వ్యక్తులు అందుబాటులో లేకపోవడంతో వాటిలో కొన్ని వెనక్కి వచ్చేశాయి. ఇప్పుడు 2022 ఆగస్టు నుంచి 2023 ఆగస్టు వరకు ఈ కార్డులు అందని వారి కోసం తమ ఆధార్ కార్డులతో వచ్చి రవాణా శాఖ కార్యాలయాల్లో తీసుకునే వెసులుబాటు కల్పించారు.

ఇక డిజిటల్ రూపంలో..

కొత్త నిబంధనల ప్రకారం ఇకపై డ్రైవింగ్ లైసెన్సులు, ఆర్సీలను కార్డుల స్థానంలో డిజిటల్ రూపంలోనే (కాగితం రహిత) జారీ కానున్నాయి. ఇక మీదట వీటి కోసం ఎవరూ ఆర్టీవో కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం రాదు. మునుపటిలా కార్డుల జారీకి ఫీజు సొమ్ము చెల్లించాల్సిన పని కూడా ఉండదు. ఇందు కోసం కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ (మోర్త్) రూపొందించిన sarathiparivahan.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి దరఖాస్తు చేసుకుంటే సరిపోతుంది. నిర్ణీత వ్యవధిలో డిజిటల్ కార్డు జారీ అవుతుంది. వీటిని డిజి లాకర్‌లోనూ భద్రపరచుకోవచ్చు. ప్లాస్టిక్ కార్డుపై ముద్రించుకోవచ్చు. ప్రభుత్వం తీసుకున్న సరికొత్త నిర్ణయంతో డ్రైవింగ్ లైసెన్సులు, ఆర్సీ కార్డులు పొందే వారికి ఫీజు భారం తప్పుతుంది. వీటి జారీ కూడా సులభతరం అవుతుండడంతో వాహనదారులకు ఊరట లభించనుంది.

సత్వరమే వినతుల పరిష్కారం

- డయల్ యువర్ సీపీకి 20 ఫిర్యాదులు
- పోలీస్ కమిషనర్ రవిశంకర్



కాలర్‌తో మాట్లాడుతున్న సీపీ రవిశంకర్

దొండపర్తి: డయల్ యువర్ సీపీ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రతి నెల 1, 15 తేదీల్లో నిర్వహిస్తున్న డయల్ యువర్ సీపీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం 20 మంది కాలర్స్ ఫోన్ చేసి సీపీకి ఫిర్యాదులు చేశారు. సీపీ రవిశంకర్ ప్రతి ఒక్క కాలర్‌తో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఫిర్యాదులను చట్టపరంగా వెంటనే చర్యలు తీసుకోవాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులను ఆదేశించారు. కాలర్స్ ఇచ్చిన ఫిర్యాదుల్లో భూ వివాదాలు, భార్యభర్తల గొడవలు, సివిల్ కేసులు, వ్యాపారం కోసం నగదు ఇచ్చి మోసపోయిన వారు, నగర ట్రాఫిక్ సమస్యలకు సంబంధించినవి ఉన్నాయి. ప్రజలు తమ సమస్యలను స్వయంగా ఫిర్యాదు చేయాలంటే 0891-2523408 నెంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు. అలాగే సీపీ వాట్సాప్ ద్వారా ఫొటోలు, వీడియోలతో కూడా 9493336633 నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో డీసీపీ-1 కె.శ్రీనివాసరావు, డీసీపీ-2 కె.ఆనందరెడ్డి, డీసీపీ(క్రైం) జి.నాగన్న, ఏడీసీపీ(ఎస్‌బీ) ఇ.నాగేంద్రుడు పాల్గొన్నారు.

పోర్టులో స్వచ్ఛభారత్ క్యాంపెయిన్

అభినందించిన కేంద్ర మంత్రి

దొండపర్తి: విశాఖ పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్‌పై స్పెషల్ క్యాంపెయిన్ 3.0కు శ్రీకారం చుట్టారు. నెల రోజులపాటు పోర్టు పరిసరాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహణకు పోర్టు యాజమాన్యం ప్రణాళికలు రూపొందించింది. ప్రధాని మోదీ పిలుపు మేరకు నిర్వహించిన ఏక్ తారీఖ్, ఏక్ గంటా, ఏక్ సాత్ కార్యక్రమంలో పోర్టు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, విదేశీ నౌకల నుంచి వచ్చిన సిబ్బంది పాల్గొన్నారు. స్వచ్ఛభారత్ స్పెషల్ క్యాంపెయిన్ 3.0ను ఘనంగా నిర్వహించడంపై విశాఖ పోర్టు అథారిటీ యాజమాన్యాన్ని, సిబ్బందిని పోర్టులు, షిప్పింగ్, జల రవాణా శాఖ సహాయ మంత్రి శంతను ఠాకూర్ ఎక్స్(ట్విట్టర్) వేదికగా అభినందించారు. ఈ క్యాంపెయిన్‌లో భాగంగా పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాల్సిన ప్రదేశాలను గుర్తించడం, కార్యాలయాల సుందరీకరణ, సమర్థవంతంగా కార్యాలయంలో స్థల వినియోగం, తుక్కు, నిరుపయోగమైన వస్తువులను నిబంధనల మేరకు తొలగించడం వంటి కార్యక్రమాలు పోర్టు యాజమాన్యం చేపట్టనుంది. అలాగే క్యాబినెట్ నోట్లు, మూడు నెలల కంటే ఎక్కువ సమయం పెంగిండ్‌లో ఉన్న పార్లమెంటరీ హామీలు, ప్రధాన మంత్రి కార్యాలయ సూచనలు, పబ్లిక్ గ్రీవెన్స్‌లు, రికార్డుల నిర్వహణ వంటి అంశాలపై దృష్టి పెట్టనున్నారు.

ఆ వ్యాఖ్యలను ప్రజలంతా విన్నారు

మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సబ్బవరం: మహిళా మంత్రిపై మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఎటువంటి అనుచిత వాఖ్యలు చేశారో ప్రజలంతా చూశారని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మంగళవారం 88వ వార్డు పరిధిలోని నంగినారపాడు శివారు కొత్తూరులో రూ.7.75 కోట్ల జీవీఎంసీ నిధులతో విస్తరించనున్న రోడ్డుకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, మేయర్ హరి వెంకటకుమారితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా మంత్రిపై మాజీ ఎమ్మెల్యే బండారు అసభ్యకర వ్యాఖ్యల నేపథ్యంలో మహిళా కమిషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారన్నారు. అతడికి హైకోర్టు బెయిల్ ఇవ్వడంతో న్యాయం గెలిచిందని చెప్పుకుంటున్నారని, అయితే బెయిల్ రాక జైల్లో ఉన్న చంద్రబాబు అవినీతి చేసినట్టేనని ఒప్పుకున్నట్లే కదా అని ప్రశ్నించారు. నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ పేరుతో చంద్రబాబు డబ్బులు కొట్టేశాడు కాబట్టే కోర్టు జైలుకు పంపించిందన్నారు. ఎవరు తప్పుచేసినా శిక్ష తప్పదని తెలిపారు.

బండారు వ్యాఖ్యలు సిగ్గుచేటు

విశ్రాంత వీసీ ఆచార్య లజపతిరాయ్

మహారాణిపేట: మాజీమంత్రి బండారు సత్యనారాయణమూర్తి మహిళలను అవమాన పరిచేలా వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని విశ్రాంత వీసీ ఆచార్య హనుమంతు లజపతిరాయ్ అన్నారు. రాజకీయ నాయకులు తమ వ్యాఖ్యలను రాజకీయాలకే పరిమితం చేసుకోవాలని, వ్యక్తిగత కక్షతో ప్రత్యర్థులపై ఇలా వ్యవహరించడం సరికాదని హితవు పలికారు. మహిళలు రాజకీయాల్లోకి రావాలని ఓ వైపు మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్ ఆమోదించిన సందర్భంలో.. మంత్రి రోజాపై బండారు వ్యాఖ్యలు దురదృష్టకరమన్నారు.

6న జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం



డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం ఈ నెల 6న మేయర్, స్థాయీ సంఘ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన జరగనుంది. జోన్-5 పరిధిలో గుల్లలపాలెం వాణిజ్య సముదాయంలోని 35 నంబర్ షాపు లీజును అనివార్య కారణాల వల్ల ఆగస్టు 29న రద్దు చేశారు. ఆ దుకాణం లీజు రద్దు అంశం సభ్యుల చర్చకు రానుంది. జోన్-7(అనకాపల్లి) పరిధి మున్సిపల్ హైస్కూల్ లైన్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న 3వ నంబర్ దుకాణాన్ని లీజుకు ఇచ్చేందుకు ఆగస్టు 30న బహిరంగ వేలం వేశారు. దీని ఆమోదానికి చర్చించనున్నారు. 61వ వార్డు మల్కాపురం మార్కెట్‌లో మార్కెట్ భవన నిర్మాణానికి పరిపాలన అనుమతి, 58వ వార్డు గుల్లలపాలెం శ్రీహరిపురం ప్రధాన రహదారి నుంచి హెచ్‌పీసీఎల్ ప్రహరీ వరకు వరద నీటి కాలువ నిర్మాణం, 40వ వార్డు ఐవోసీఎల్ ప్రహరీ వద్ద వరద నీటి కాలువ నిర్మాణం, జోన్-5 పరిధి 40 నుంచి 63వ వార్డుల వరకు స్వచ్ఛ సర్వేక్షణ్ నిర్వహణకై అదనపు సిబ్బంది నియామకం తదితర అంశాలు సభ్యుల చర్చకు రానున్నాయి.

నేడు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పర్యటన

మహారాణిపేట: కేంద్ర సమాచార శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ బుధవారం విశాఖలో పర్యటించనుంది. కమిటీ చైర్‌పర్సన్ ప్రతాప్‌రావ్ జాదవ్ అధ్యక్షతన 20 మంది లోక్‌సభ, 10 మంది రాజ్యసభ సభ్యుల బృందం పర్యటించనుంది. బుధవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు బీఎస్ఎన్ఎల్, రైల్‌టెల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, భారతీ ఎయిర్‌టెల్, భారతీ ఎక్సాకామ్, రిలయన్స్, జియో సంస్థల ప్రతినిధులతో కమిటీ సభ్యులు సమావేశం కానున్నారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఎంఈఐటీవై), హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ టెస్ట్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రతినిధులతో సమావేశం కానున్నారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు సెంటర్ ఫర్ మెటీరియల్స్ ఫర్ ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ ప్రతినిధులతో భేటీ కానున్నారు. 5వ తేదీన ఉదయం 10.30 గంటలకు ఇండిగో విమానంలో తిరుపతి వెళ్తారు.

క్లుప్తంగా

మందుబాబులకు భారీ జరిమానా

అల్లిపురం: నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో పట్టుబడిన 150 మందిని మంగళవారం పలు కోర్టుల్లో హాజరు పరచగా.. వారికి న్యాయమూర్తులు రూ.7,00,500 జరిమానా విధించారు. న్యూపోర్టు, హార్బర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 34 మందిని ఒకటవ స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా.. వారందరికీ రూ.1,55,500 జరిమానా విధించారు. పీఎంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో 22 మందిని స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కమ్ ఎక్సైజ్ కోర్టులో హాజరు పరచగా.. ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున రూ.1,10,000 జరిమానా విధించారు. గోపాలపట్నం స్టేషన్ పరిధిలో 13 మందికి రూ.65,000, పెందుర్తి పరిధిలో 17 మందికి రూ.64,000, గాజువాక పరిధిలో 52 మందికి రూ.2,38,000, వన్‌టౌన్ పరిధిలో 12 మందికి రూ.68,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తులు తీర్పులు వెల్లడించారు. మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడితే జరిమానాతోపాటు జైలు శిక్ష కూడా అనుభవించాల్సి ఉంటుందని ఈ సందర్భంగా సీపీ హెచ్చరించారు.

బీవోఐ హంటర్స్ విజయం



విజేతకు ట్రోఫీ అందిస్తున్న బీవోఐ జోనల్ మేనేజర్ శ్రీనివాస్, జేజేశ్వరరావు

దొండపర్తి: బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన చాంపియన్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌లో బ్యాంక్ ఆఫ్ ఇండియా హంటర్స్ విజయం సాధించారు. వైఎస్సార్ స్టేడియం బీ గ్రౌండ్‌లో ఈ టోర్నమెంట్ ఉత్సాహంగా జరిగింది. జోన్‌లో అనేక బ్రాంచ్‌ల నుంచి క్రీడాకారులు 6 జట్లతో తలపడ్డారు. బీవోఐ హంటర్స్, బీవోఐ స్టార్స్ మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో హంటర్స్ జట్టు విజయం సాధించింది. టోర్నమెంట్ బెస్ట్ బ్యాట్స్‌మన్, మ్యాన్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నవీన్(దర్భగూడెం బ్రాంచ్) అవార్డు అందుకున్నారు. సురేష్(సామర్లకోట బ్రాంచ్) బెస్ట్ బౌలర్‌గా నిలిచారు. ఈ సందర్భంగా బ్యాంక్ జోనల్ మేనేజర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటువంటి క్రీడా కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. డిప్యూటీ జోనల్ మేనేజర్ ఎస్.జేజేశ్వరరావు క్రీడాకారుల క్రీడా స్ఫూర్తిని అభినందిస్తూ అవార్డులు ప్రదానం చేశారు.

దేశ అభివృద్ధిలో యువతే కీలకం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న విజయరావు, హరనాథ్, మహేశ్వరరావు తదితరులు

ఘనంగా కశ్మీరీ యువ సమ్మేళనం

బీచ్‌రోడ్డు: దేశ అభివృద్ధిలో యువతే కీలకమని నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ రాష్ట్ర సంచాలకులు విజయరావు అన్నారు. మంగళవారం వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో కశ్మీరీ యువ సమ్మేళనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన ప్రాంతాలను మనమే అభివృద్ధి చేసుకునేందుకు ఇటువంటి సమ్మేళనాలు ఉపయోగపడతాయన్నారు. విశాఖలోని ప్రముఖ ఆలయాలను రెండు రోజులపాటు యువకులు సందర్శిస్తారన్నారు. వాటి ద్వారా ఎన్నో విశేషాలు, వాటి ప్రముఖ్యతలు తెలుసుకోవాలని కోరారు. నా మట్టి నాదేశం కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి విశాఖలో వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన మట్టితో కలశం చేయించారు. అనంతరం మేరీ మాటి మేరా దేశ్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో భాగంగా కశ్మీరీ యూత్ ప్రదర్శన, గాయత్రి విద్యార్థినుల కూచిపూడి నృత్యం ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం సమ్మేళనం కార్యక్రమాల వివరాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువజన కేంద్ర జిల్లా అధికారి మహేశ్వరరావు, ఏయూ ఎన్ఎస్ఎస్ అధికారి హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న బాలికల నృత్య ప్రదర్శన

పట్టపగలే కారులో చోరీ


వివరాలు సేకరిస్తున్న క్రైం పోలీసులు


దొంగలు పగలగొట్టిన కారు అద్దం

- సాయిరాం హోటల్ పార్కింగ్ స్థలంలో ఘటన
- పనిచేయని సీసీ కెమెరా

సీతమ్మధార: పార్కింగ్ చేసిన కారు అద్దాన్ని పట్టపగలే పగలగొట్టి బంగారు ఆభరణాలు, నగదు దోచుకెళ్లిన ఘటన నగరం నడిబొడ్డున జరిగింది. ఎప్పుడూ జనసంచారం ఉండే డైమండ్ పార్కు దరి సాయిరాం హోటల్ పార్కింగ్ స్థలంలో ఈ ఘటన జరగడంతో కలకలం రేగింది. బాధితుడు తెలిపిన వివరాలివీ.. రెండు రోజుల పాటు వరస సెలవులు రావడంతో విజయవాడకు చెందిన జి.శ్రీనివాసరెడ్డి తన కుటుంబంతో అరకు విహారయాత్రకు వెళ్లారు. యాత్ర ముగించుకుని నగరానికి వచ్చారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు డైమండ్ పార్కు దరి సాయిరాం పార్లర్‌కు టిఫిన్‌కు వెళ్లారు. తన కారును హోటల్ పార్కింగ్ స్థలంలో పార్కింగ్ చేశారు. టిఫిన్ చేసి తిరిగి 11.15 గంటలకు వచ్చి చూసే సరికి కారు అద్దం పగిలి ఉండటాన్ని చూసి కంగారు పడ్డారు. లోపల చూస్తే బ్యాగు కనిపించలేదు. చోరీ జరిగిందని గ్రహించి వెంటనే డయల్ 100కు కాల్ చేశారు. బ్యాగులో రెండున్నర తులాల బంగారం, రూ.10వేల నగదు, విలువైన కార్డులు ఉన్నట్లు శ్రీనివాసరెడ్డి తెలిపారు. క్రైం డీసీపీ నాగేంద్రుడు, ఫోర్త్‌టౌన్ క్రైం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. పార్కింగ్ వద్ద ఉద్యోగం చేస్తున్న సెక్యూరిటీ గార్డులను పోలీసులు విచారిస్తున్నారు. కాగా.. ఇక్కడ ఏర్పాటు చేసిన రెండు కెమెరాల్లో ఒకటి పనిచేయడం లేదు. రెండోది ఘటన జరిగిన వైపు కాకుండా మరో వైపు ఉంది. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు చెబుతున్నా.. హోటల్ యాజమాన్యం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సాక్షి ఫొటోగ్రాఫర్ మోహనరావుకు అవార్డు


మోహనరావును సన్మానిస్తున్న కొమ్మినేని శ్రీనివాసరావు, విజయబాబు

దొండపర్తి: సాక్షి అసిస్టెంట్ చీఫ్ ఫొటోగ్రాఫర్ పి.ఎల్.మోహనరావుకు ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీలో పి.ఎల్.మోహనరావు తీసిన ఫొటో ఎంపికై ంది. ఈ నేపథ్యంలో మంగళవారం విజయవాడలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా కమిషన్ చైర్మన్ పి.విజయబాబు చేతులమీదుగా ఆయన అవార్డు అందుకున్నారు.

అనుమతి కోసం అడ్డదారి

- తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో గుర్తింపునకు దరఖాస్తు
- ప్రైవేట్ పాఠశాలల రెన్యువల్స్‌కు నిబంధనలు బేఖాతర్
- నాలుగు స్కూళ్ల ఫైర్ సర్టిఫికెట్లపై రీ వెరిఫికేషన్
- అవి తప్పుడు పత్రాలని అగ్నిమాపక అధికారుల నిర్ధారణ
- యాజమాన్యాలపై చర్యలు కోరుతూ డీఈవోకు ఆర్జేడీ లేఖ
- ఆర్జేడీ కార్యాలయ సూపరింటెండెంట్ నరెండర్‌తో కొత్త ట్విస్ట్

విశాఖ విద్య: నగరంలోని కొన్ని ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు ఫేక్ ఫైర్ సర్టిఫికెట్లతో విద్యాశాఖాధికారులను బురిడీ కొట్టించారు. ఆర్జేడీ కార్యాలయ అధికారులు అనుమానించిన ఆ నాలుగు ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్లు తప్పుడు పత్రాలు అని జిల్లా అగ్నిమాపక శాఖాధికారులు ధ్రువీకరించారు. స్కూళ్ల గుర్తింపు/రెన్యువల్‌కు ఆర్జేడీ కార్యాలయంలో పెద్ద మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ప్రైవేట్ స్కూళ్ల అసోసియేషన్ చేసిన ఫిర్యాదుల నేపథ్యంలో సూపరింటెండెంట్‌ను కమిషనరేట్‌కు సరెండర్ చేయగా.. ఈ తరుణంలో ప్రైవేట్ స్కూళ్ల తప్పుడు సర్టిఫికెట్ల వ్యవహారం వెలుగులోకి రావడం విద్యా శాఖ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

జిల్లాలో 1,385 పాఠశాలలు ఉండగా, ఇందులో 775 ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోనే ఉన్నాయి. ఏటా ఇక్కడ చదువుకునే సుమారు 3.70 లక్షల మంది విద్యార్థుల్లో 2.50 లక్షలకు మందికి పైగానే ప్రైవేట్ స్కూళ్లలో చేరుతున్నారు. రెసిడెన్షియల్ స్కూళ్లు నిర్వహిస్తుండటంతో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి విద్యార్థులు నగరానికి వస్తున్నారు. కానీ చాలా స్కూళ్లు సరైన వసతులు, అర్హత గల ఉపాధ్యాయులు లేకుండానే నిర్వహిస్తున్నాయి. విద్యార్థులకు ఫీజుల భారమే తప్ప, నాణ్యమైన విద్య అందడం లేదు. ఈ క్రమంలో ప్రైవేట్ స్కూళ్ల విద్యా వ్యాపారానికి అడ్డుకట్ట వేసేలా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. పాఠశాలల నిర్వహణకు అనుమతులు ఇచ్చే విషయంలో విద్యాశాఖ నిబంధనలను కఠినతరం చేసింది.

ప్రలోభాలకు గురి చేసి..

ప్రైవేట్ పాఠశాలలకు అనుమతులిచ్చేందుకు అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలను విద్యాశాఖ తీసుకొచ్చిన 'స్కూల్ మానిటరింగ్ యాప్'లో అప్‌లోడ్ చేయాలి. నిర్దేశించిన పత్రాల్లో ఏ ఒక్కటి లేకున్నా.. అటువంటి స్కూళ్లకు గుర్తింపు ఇవ్వొద్దని విద్యాశాఖ కమిషనర్ స్పష్టమైన ఆదేశాలిచ్చారు. 2023-24 విద్యా సంవత్సరం నుంచే దీన్ని పక్కాగా అమలు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ప్రైవేట్ స్కూళ్ల నిర్వహణలో ఉన్న లోపాలు ఒక్కోటి వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే విద్యార్థులను చేర్చుకున్నందున.. ఏదో రీతిన అనుమతులు పొందితే చాలన్న రీతిలో అడ్డదారులు తొక్కి.. విద్యాశాఖాధికారులను ప్రలోభాలకు గురి చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆర్జేడీ కార్యాలయంలో అవినీతి బయటపడిందనే ప్రచారం సాగుతోంది.

ఆ నాలుగు స్కూళ్లు ఇవే..

- బాలాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ (హై ఫీల్డ్ స్కూల్), పురుషోత్తపట్నం
- వాణి వెంకటేశ్వర విద్య విహార్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, శివాజీ పాలెం
- రత్నం ఇంగ్లిష్ మీడియం స్కూల్, ఓల్డ్ డెయిరీ ఫారం, చినగదిలి
- బ్రిలియంట్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, ఆరిలోవ, చినగదిలి

విచారణకు ఆదేశించాం



నగరంలో నాలుగు పాఠశాలల నిర్వాహకులు తప్పుడు ఫైర్ సేఫ్టీ పత్రాలు సమర్పించినట్లు తేలింది. దీనిపై తదుపరి చర్యలు తీసుకోవాలని డీఈవోకు ఆదేశాలు జారీ చేశాం. కమిషనర్ నుంచి వచ్చిన ఉత్తర్వులు ప్రకారం అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు ఉన్న పాఠశాలలకే అనుమతులు ఇస్తున్నాం. డీఈవో సిఫార్సుతో మాకు దరఖాస్తులు వస్తాయి. ఏదైనా లోపం ఉంటే, తిరిగి వారికే పంపిస్తున్నాం. ఈ విషయంలో మా కార్యాలయంలో ఎలాంటి అవినీతికి ఆస్కారం లేదు.

– ఎం.జ్యోతి కుమారి, రీజినల్ జాయింట్ డైరెక్టర్, విశాఖపట్నం

బీజేపీ కార్యవర్గ సభ్యుడిగా లక్ష్మీనారాయణ

ఎంవీపీకాలనీ: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా విశాఖకు చెందిన బుద్ధా లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. ఆ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఉత్తర్వులు జారీ చేశారు. 1994 నుంచి బీజేపీ క్రియాశీలక కార్యక్రమాల్లో లక్ష్మీనారాయణ విశేష సేవలు అందిస్తున్నారు. గతంలో ఆయన రాష్ట్ర కార్యవర్గంలో సేవలు అందించగా ప్రస్తుతం మరోసారి ఆ అవకాశం లభించింది. ఈ సందర్భంగా ఆయనకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీవిశ్వనాథరాజు తదితరులు అభినందనలు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి నిరసనగా రేపు బహిరంగ సభ

గాజువాక : స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలన్న నిర్ణయానికి వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 5న బహిరంగ సభ నిర్వహించనున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తెలిపారు. కూర్మన్నపాలెం జంక్షన్‌లో నిర్వహించనున్న ఈ సభకు సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి హాజరవుతున్నారన్నారు. గాజువాకలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ సభలో ప్రజలు, కార్మికులు తమ కుటుంబ సభ్యులతో సహా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

చెస్‌లో హాన్య, ఆన్ష్ ఆధిక్యం


భూమిక ఎత్తుకు పైఎత్తు వేసి ఆధిక్యం కొనసాగించిన హాన్య

విశాఖ స్పోర్ట్స్: 36వ జాతీయ అండర్-11 చదరంగం చాంపియన్‌షిప్ బాలికల్లో హాన్య షా, ఓపెన్‌లో ఆన్ష్ నందన్ ఆధిక్యం కొనసాగిస్తున్నారు. బాలికల విభాగం పోటీల్లో ఆడిన ఐదు రౌండ్లలోనూ విజయాలతో హాన్య(గుజరాత్), వితస్థ(హర్యానా), ప్రతితీ(కర్ణాటక), ఏఎఫ్ఎం త్రిపురాంబిక(ఏపీ) ఆరో రౌండ్‌కు చేరుకున్నారు. ఏపీకి చెందిన భావన్య, ఏఎఫ్ఎంలు మైషా, దివ్య నాలుగేసి పాయింట్లతో కొనసాగుతున్నారు. ఎరీనా ఫిడే మాస్టర్(ఏఎఫ్ఎం) సన, ఎరీనా క్యాండిడేట్ మాస్టర్(ఏసీఎం) అర్పితలు రెండున్నర పాయింట్లు సాధించి వెనుకబడ్డారు.

- ఓపెన్ కేటగిరీలో ఆన్ష్ నందన్(మహారాష్ట్ర), సంజయ్(తమిళనాడు), ఆరవ్(కర్ణాటక), మాదేష్(పుదుచ్చేరి) ఆడిన ఐదు రౌండ్లలోనూ విజయాలతో ఆరో రౌండ్‌కు దూసుకెళ్లారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హిమల్‌వర్ధన్, ఎ.అఖిల్ నాలుగున్నరేసి పాయింట్లతో టాప్-10లో కొనసాగుతున్నారు. ఓపెన్ ఐదో రౌండ్‌లో టాప్ బోర్డుపై ఆడిన కాండిడెట్ మాస్టర్ వివాన్‌ను మాదేష్ 78వ ఎత్తు వద్ద ప్రత్యర్థి కింగ్‌పై దాడి చేసి విజయం సొంతం చేసుకున్నాడు. రితేష్ 36వ మూవ్ వద్ద ఆయాన్‌తో డ్రా చేసుకున్నాడు. రెండో బోర్డుపై ఆడిన టోర్నీ మూడో ర్యాంకర్ ఆన్ష్ 38 ఎత్తులోనే రాహుల్‌పై విజయం సాధించాడు. మూడో బోర్డుపై మెరుగైన రేటింగ్‌తో ఆడిన సంజయ్ 60వ ఎత్తులో బదోల్‌పై విజయం సాధించాడు. టోర్నీ టాపర్‌గా బరిలోకి దిగిన అపార్(కర్ణాటక) నాలుగు పాయింట్లతో కొనసాగుతున్నాడు. ఏఎఫ్ఎం పవన్ మెరుగైన రేటింగ్‌తో ఆడినా భానుషాలి(మహారాష్ట్ర) చేతిలో ఓటమి పాలయ్యాడు. బుధవారం ఆరో రౌండ్‌లో ఐదేసి పాయింట్లతో సముజ్జీగా నిలిచిన ఆన్ష్‌తో ఆరవ్ టాప్ బోర్డుపైన, మాదేష్‌తో సంజయ్ రెండో బోర్డుపైన ఆధిక్యానికి పోటీపడనున్నారు.
- బాలికల విభాగపు ఐదో రౌండ్‌లో టాప్ బోర్డ్‌పై తలపడిన భూమికను హాన్య 75వ ఎత్తులో చిత్తుచేసి ఆధిక్యాన్ని కొనసాగిస్తుంది. రెండో బోర్డుపై ఆడిన ఆంధ్రా చిన్నారి త్రిపురాంబిక 60వ ఎత్తులో సరన్యా(తెలంగాణ)ను చిత్తుచేసింది. ప్రతిభ 75వ ఎత్తులోనూ, వితస్థా ఏకంగా బాలికల టోర్నీ టాపర్ ఆంధ్రా చిన్నారి ఆముక్తను 59 ఎత్తులో కంగు తినిపించింది. విశాఖలోని పోర్ట్ స్టేడియంలో మూడో రోజు మంగళవారం ఐదో రౌండ్ పోటీలు జరిగాయి. ఆంధ్ర చెస్, ఆల్ విశాఖ చెస్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో 11 రౌండ్ల పాటు ఈ చాంపియన్‌షిప్ జరగనుండగా.. 27 రాష్ట్రాలకు చెందిన చిన్నారులు పోటీపడుతున్నారు.

లాడ్జిలో యువకుడి ఆత్మహత్య


రాజేష్‌కుమార్ గౌడ్(ఫైల్)

సీతమ్మధార : అనారోగ్యం కారణంగా ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంతకు ముందు తన సోదరితో వాట్సాప్ కాల్‌లో మాట్లాడుతూ తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పి ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఈ సంఘటన ఫోర్త్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్‌కు చెందిన కె.రాజేష్‌కుమార్ గౌడ్ (23) మంగళవారం హైదరాబాద్ నుంచి విశాఖ వచ్చాడు. ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్ వెనుక రోడ్డులోని ఓ లాడ్జిలో రూం తీసుకున్నాడు. అనారోగ్య కారణంగా మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో మాత్రలు వేసుకొని తన అక్కకు వాట్సాప్ కాల్ చేసి చనిపోతున్నట్టు చెప్పాడు. దీంతో అతని అక్క వెంటనే ఫోర్తుటౌన్ సీఐ విజయకుమార్‌కు సమాచారమందించింది. పోలీసులు ఆ లాడ్జికి వెళ్లారు. తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లేసరికి ఫ్యానుకు వేలాడుతూ కనిపించాడు. వారం క్రితం రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ లాడ్జిలో కూడా ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అప్పుడు పోలీసులు సకాలంలో స్పందించి రక్షించారు. సీఐ విజయకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.